

ఉషస్సుల ఉగాది




విక్రయానికి సిద్ధంగా ఉన్న ఉగాది పచ్చడి పదార్థాలు

- నేడు శ్రీ విశ్వావసు నామ సంవత్సరం షురూ..
- తెలుగు నూతన సంవత్సరం ఆరంభం
- ఇంటింటా పర్వదినం సందడి
- ప్రత్యేక పూజలు.. పంచాంగ శ్రావణాలకు సిద్ధం

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): శ్రీ విశ్వావసు నామ సంవత్సర చైత్ర బహుళ పౌడ్యమి ప్రారంభం కానుంది. ఉగాది పర్వదినం ఆదివారం జరగనుంది. దీంతోపాటే తెలుగు నూతన సంవత్సరం కూడా ప్రారంభం కానుంది. ఉగాది పర్వదినాన్ని జిల్లా వ్యాప్తంగా హిందువులు ఘనంగా జరుపుకోనున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి, షడ్రుచుల పచ్చళ్లు తయారుచేసి ఆరగించనున్నారు. అలాగే అన్ని ఆలయాల్లో పంచాంగ శ్రవణం జరగనుంది.

ఉగాది అంటే...

ఉగా అంటే నక్షత్ర గమనం. ఆది అంటే ఆరంభం అర్థం. నక్షత్ర గమనం ఆరంభమవుతుంది కాబట్టి దానిని ఉగాది అంటారు. అంటే సృష్టి ఆరంభమైన దినమన్నమాట. యుగం అంటే ద్వయం లేదా.. జంట అని అర్థం. ఉత్తరాయణ, దక్షిణాయన ద్వయ సంయుతం యుగం కాగా ఆ యుగానికి ఆది ఉగాదిగా మారింది. తెలుగు కొత్త సంవత్సర ఆ రోజే ప్రారంభమవుతుంది కాబట్టి ఈ పర్యదినాన్ని జరుపుకుంటాం. ఇది తెలుగు వారి తొలి పండుగ. చైత్ర శుద్ధ పౌడ్యమి నాడు వచ్చే ఈ పర్వదినానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది.

ఈ నూతన సంవత్సరంలో రాశి ఫలాలు, గ్రహ స్థితులు ఎలా ఉన్నాయో తెలుసుకోవడం ఆనవాయతీ. గ్రహశాంతులు జరిపించుకుని సుఖంగా ఉండేందుకు పంచాంగ శ్రవణాన్ని చేసుకుంటారు.

జీవిత పరమార్థాన్ని తెలిపే పచ్చడి

మనిషి నిత్యజీవితంలో ఒడిదుడుకులు, సమస్యలు ఎలా ఉంటాయో.. దానిని ఉగాది పచ్చడితో పెద్దలు పోల్చి చెప్పారు. ఉగాది రోజు ముఖ్యమైన వంటకం ఇది. షడ్రుచుల (ఆరు రుచులు) సమ్మేళనంగా చేసే ఈ పచ్చడి జీవితంలో జరిగే వివిధ అనుభవాలను, అనుభూతులను సూచిస్తుంది. పచ్చడి ఒక్కొక్క పదార్థం ఒక్కో భావానికి, అనుభవానికి ప్రతీక. బెల్లం తీపి, ఆనందానికి ప్రతీక, ఉప్పు జీవితంలో ఉత్సాహం, రుచికి సంకేతం. వేప పువ్వు చేదు, బాధ కలిగించే అనుభవాలకు, చింతపండు పులుపు, నేర్పుగా వ్యవహరించాల్సి పరిస్థితులు, పచ్చి మామిడి ముక్కలు వగరు, కొత్త సవాళ్లు. కారం సహనం కోల్పోయేలా చేసే పరిస్థితులను అదుపు చేసేలాగా అభివర్ణిస్తారు.



అన్ని రాశుల వారికీ శుభాలే..

- మురళీకృష్ణ, హనుమాన్ దేవాలయం అర్చకుడు, భూపాలపల్లి

దాదాపు అన్ని రాశుల వారికీ శుభాలే ఎక్కువగా ఉన్నాయి. ఈసారి వర్షాలు తక్కువ ఉన్నట్లు శాస్త్రం సూచిస్తోంది. ధరలు పెరుదల విపరీతంగా ఉంటుంది. రాజకీయాల్లో ఒడిదుడుకులు అధికమవుతాయి. పంటలు బాగా పండుతాయి. రాజు గజారూఢుడైనందున ప్రజలు సుభిక్షంగా ఉంటారు.

తహసీల్దార్ లైంగికంగా వేధిస్తున్నాడు..

కలెక్టరేట్‌లో ఓ మహిళా ఉద్యోగి ఫిర్యాదు

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తనను తహసీల్దార్ లైంగికంగా వేధిస్తున్నాడని ఆరోపిస్తూ ఓ మహిళా ఉద్యోగి కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయడం కలకలం రేపింది. కాటారం సబ్ డివిజన్‌లోని ఓ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆమె శనివారం కలెక్టరేట్‌కు వచ్చిందని తెలిసింది. తహసీల్దార్ తనను లైంగికంగా వేధిస్తున్నాడని కలెక్టర్ రాహుల్ శర్మకు ఫిర్యాదు చేయడానికి ఆమె రాగా ఆ సమయంలో ఆయన అందుబాటులో లేరని, దీంతో కలెక్టరేట్ ఏవో మొయినొద్దీన్ ఖాజాకు ఫిర్యాదు చేసిందని సమాచారం. తహసీల్దార్‌పై మహిళా ఉద్యోగిని ఫిర్యాదుతో రెవెన్యూ శాఖలో చర్చనీయాంశమైంది. ఆమెను వేధించిన తహసీల్దార్ ఎవరనే చర్చ మొదలైంది. అయితే.. ముందు నుంచే ఆ తహసీల్దార్ తీరు మండలంలో వివాదాస్పదంగా ఉందనే విమర్శలు వస్తున్నాయి. తన వద్ద పనిచేసే సిబ్బందిని ఆయన

మిగతా 10వ పేజీలో...





ఫస్ట్ ఏషియన్ పారా ఒలంపిక్‌లో ప్రతిభ

బ్రాంజ్ మెడల్ సాధించిన జిల్లా వాసి



ఫస్ట్ ఏసియన్ పారా ఒలంపిక్‌లో బ్రాంజ్ మెడల్ సాధించిన జ్యోతి

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): కంబోడియా దేశంలో జరిగిన ఫస్ట్ ఏషియన్ పారా ఒలంపిక్ పోటీల్లో జిల్లా వాసి కావేరి జ్యోతి ప్రతిభను కనబర్చింది. బ్రాంజ్ మెడల్ సాధించి సత్తాచాటింది. పలిమెల మండల కేంద్రానికి చెందిన నిరుపేద దళిత వికలాంగురాలైన కావేరి జ్యోతి పారా ఒలంపిక్ పోటీల్లో పాల్గొంది. ఇందుకు ఆమెకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రి శ్రీధర్‌బాబు చొరవత ఆర్థిక సాయం అందించింది. కంబోడియాకు వెళ్లేందుకు ప్రయాణ, వసతి ఖర్చులు భరించింది. పారా ఒలంపిక్ పోటీల్లో ప్రతిభను చాటిన కావేరిని కలెక్టర్ రాహుల్ శర్మ అభినందించారు.

పల్లెప్రగతికి 'కార్పొరేట్' సహకారం

- సీఎస్ఆర్ నిధులతో మౌలిక సౌకర్యాల కల్పన
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
- ఏడు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం



జగ్గన్నపేటలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మారుమూల గిరిజన పల్లెల ప్రగతిలో కార్పొరేట్ సంస్థలు భాగస్వామ్యం అవుతున్నాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు తోడ్పాటును అందిస్తుండటం శుభపరిణామమని తెలిపారు. నిర్మాణ్ ఆర్గనైజేషన్, ఓపెన్ టెక్స్, సర్వీస్‌నౌ సంస్థలు ములుగు మండలంలోని జగ్గన్నపేట, చిన్న గుంటూరుపల్లి, పులిగుండం, కొడిశలకుంట, చంద్రుతండా, ఎల్బీనగర్, వెంకటాపూర్ మండలం ఇంచెంచెర్వుపల్లి గ్రామాల్లో రూ.కోటి 50లక్షల సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన అభివృద్ధి కార్య క్రమాలను సీతక్క శనివారం ప్రారంభించారు. సోలార్ లైట్లు, పాఠశాలల్లో మూత్రశాలలు, వంటగదుల మరమ్మతు, బోరుబావి, ఆర్వో ప్లాంటు, వాటర్ ట్యాంకులను ప్రారంభించడంతోపాటు గేదెలు, ఆటోలు, బాలికలకు సైకిళ్లు, మహిళలకు పోషకాహార కిట్ల ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడు తూ ఒక్క విజ్ఞప్తికి స్పందించిన కార్పొరేట్ సంస్థలు గిరిజన గ్రామాలను దత్తత తీసుకుంటున్నాయని, మూడేళ్లపాటు సేవలందిస్తాయని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమేకాకుండా స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందిస్తాయని చెప్పారు. ప్రజలంతా ఐకమత్యంగా ఉంటూ గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాలికాబద్ధంగా పనిచేస్తోందని తెలిపారు. యువత, మహిళలకు స్వయం ఉపాధిని మెరుగుపరుస్తున్నామన్నారు. మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులను అందించడమే కాక రూ.5లక్షల వరకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామన్నారు. పావలా వడ్డీని తిరిగి మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ ప్లాంట్లు, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటు చేయించి వ్యాపారవేత్తలుగా ప్రోత్సహిస్తున్నామన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. త్వరలోనే ముగ్గుపోసే కార్యక్రమాన్ని మొదలుపెడుతామని వెల్లడించారు. ఉగాది నుంచి తెల్లరేషన్‌కార్డు లబ్ధిదారులకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. సన్న వడ్లు పండించిన రైతులందరికీ దాదాపు బోనస్ డబ్బులు అందజేశామన్నారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

ఉపాధ్యాయులు తమ విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి సీతక్క హెచ్చరించారు. జగ్గన్నపేటలోని గిరిజన బాలికల ఆశ్రమపాఠశాలలో మూత్రశాలలు, కిచెన్‌షెడ్‌లను ప్రారంభించి విద్యార్థులకు న్యూట్రీషియన్ కిట్లను అందజేశారు. ఉపాధ్యాయ వృత్తి ఆదర్శవంతమైందని, ఎవరైనా అలసత్వం వహిస్తే బదిలీలతో సరిపెట్టకుండా శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. పేద విద్యార్థులకు మంచి బోధన చేయకుంటే మీ పిల్లలకు మంచి జరగదని అన్నారు. దాదాపు ఏడేళ్ల తర్వాత డైట్, 16సంవత్సరాల తర్వాత కాస్మెటిక్ చార్జీలను పెంచి ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలలో అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్‌జీ, సంపత్‌రావు, డీపీవో దేవరాజు, ఓపెన్ టెక్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సంగీత యలమంద్ర, నిర్మాణ్ ఆర్గనైజేషన్ సీఈవో మయూర్ పట్నాల, ఎంపీడీవో రామకృష్ణ, డీఎస్పీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.











రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:35 (ఆదివారం సాయంత్రం)

ముస్లింల సంక్షేమానికి పెద్ద పీట

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

మహదేవపూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ముస్లింల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని జామా మసీదులో శనివారం సాయంత్రం జరిగిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్‌తో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మైనా రిటీ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, 2025-2026 వార్షిక బడ్జెట్‌లో రూ. 3వేల కోట్ల నిధులు కేటాయించామని అన్నారు. మైనారిటీ యువతకు, మహిళలకు స్వయం ఉపాధి కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ ప్రాంతంలో షాదీఖానా, ఖబరస్తాన్ ఏర్పాటు, మసీదుల ప్రహరీల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. రంజాన్ మాసం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోం దన్నారు. హిందువులతో కలిసి ముస్లింలు ఇఫ్తార్ విందు చేసుకోవడం మన సంస్కృతికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ప్రహ్లాద్, మాజీ ఎంపీపీ రాణిబాయి, జడ్పీటీసీ అరుణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు, పార్టీ మండల అధ్యక్షుడు అక్బర్‌ఖాన్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



భూపాలపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

కృష్ణకాలనీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో స్త్రీ శిశు, మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మహి ళా దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మహిళ లను కోటీశ్వరులు చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత 57,800 ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టామని, అందులో 40 శాతం మేర మహిళలే ఉన్నారని తెలిపారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా 14,800 అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి శ్రీకా రం చుట్టబోతున్నట్లు చెప్పారు. మహిళలకు పారిశ్రామిక పార్కు, బ్రిక్స్ రైస్, కోల్డ్ స్టోరేజ్ యూనిట్ల ఏర్పాటులో రిజర్వేషన్ కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయి త ప్రకాశ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గుమ్మడి శ్రీదేవి, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి శైలజ, ఎస్సీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సునీత, ఆర్డీవో రవి, ఇన్‌చార్జి డీడబ్లూవో మల్లీశ్వరి, సఖి అడ్మినిస్ట్రేటర్ గాయత్రి, అంగన్‌వాడీ టీచర్లు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సీఎస్‌సీ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

గణపురం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో రైతుల వినియోగార్థం ఏర్పాటు చేసిన సీఎస్‌సీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా సహకారాన్ని, ఇన్సూరెన్సులు అందించేందుకు ఈ కేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. రుణం తీసుకున్న రైతులు ఈ కేంద్రాల ద్వారా రెన్యువల్ చేసుకొనే అవకాశం ఉందన్నారు. అనంతరం చెల్పూరులోని రామాలయంలో హోమం కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో భాస్కర్, పీఏసీఎస్ చైర్మన్ కుమార్, పీఏసీఎస్ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు రాజేందర్, శివశంకర్, చోటేమియా, కట్కూరి శ్రీనివాస్, కావటి రవి, గండ్ర

మిగతా 10వ పేజీలో...

వరిలో వెదజల్లె విధానాన్ని పాటించాలి

• మల్యాల కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మాలతి



రైతు సదస్సులో మాట్లాడుతున్న మాలతి

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వరిలో వెదజల్లె విధానం పాటించాలని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.మాలతి రైతులకు సూచించారు. మహబూబాబాద్ మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కేవీకే ఆధ్వర్యంలో శనివారం షెడ్యూల్ కులాలు, ఉపకులాలతో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాలతి మాట్లాడుతూ మొక్కజొన్నలో జంట సాల్లు పద్ధతి పాటించాలని, మిర్చిలో సమగ్ర సస్యరక్షణ విధానం, పత్తిలో అధిక సాంద్రత పద్ధతిని పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఏడీఏ శ్రీనివాస్ రావు, మల్యాల శాస్త్రవేత్త ఎన్.కిశోర్‌కుమార్, శాస్త్రవేత్తలు రాంబాబు, క్రాంతికుమార్, హెచ్‌ఆర్ఎస్ శాస్త్రవేత్త ప్రశాంత్, మహబూబాబాద్ మండల వ్యవసాయాధికారి ఎన్.తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం

» గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్

వెంకటాపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : వెంకటాపురం, వాజేడు, కన్నాయిగూడెం మండలాల్లో బాండ్ మొక్కజొన్న పంట సాగుచేసి నష్టపోయిన రైతులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ కల్యాణ్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని చిరుతపల్లి గ్రామంలో ఇటీవల ఆత్మహత్యచేసుకున్న మొక్కజొన్న రైతు కుటుంబాలను ఆయన పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించి కళ్యాణ్‌నాయక్ మాట్లాడారు. 53 రోజులుగా ఆదివాసీ సంఘాలు, రైతులు మొక్కజొన్న పంట నష్టపోయారని పోరాటం చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదని, మూడు మండలాల్లో సుమారు 400 మంది రైతులు నకిలీ విత్తనాల వల్ల నష్టపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ విత్తనాలు పంపిణీ చేసిన కంపెనీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రి సీతక్క సొంత జిల్లాలో రైతులు ఆత్మహత్య చేసుకుంటే కనీసం వారి కుటుంబాలను ఇప్పటి వరకు పరామర్శించకపోవడం బాధాకరమని అన్నారు. మొక్కజొన్న పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.2లక్షల పరిహారం అందించాలని, మృతి చెందిన రైతు కుటుంబాలకు రూ.50లక్షల చొప్పున అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆర్గనైజన్లు, సీడ్ ఇస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ త్రినాథ్, గిరిజన మోర్చా జనరల్ సెక్రటరీ సురేందర్, జిల్లా నాయకురాలు గుగులోత్ స్వరూప, నాయకులు అట్లూరి రఘురాం, బుచ్చయ్య, బొల్లె సునీల్, రామెళ్ల శేఖర్, సంకా హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

» పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



ఏటూరునాగారంలోని ఐటీడీఏ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి సీతక్క

ఏటూరునాగారం రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారతే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటీడీఏలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను మంత్రి శనివారం ప్రారంభించారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మహిళా సంఘాలకు పావలా వడ్డీ చెక్కు అందజేశారు. కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ సుదూరప్రాంతాల్లో నుంచి ఐటీడీఏకు వచ్చేవారికి భోజన ఇబ్బందులు కలగకుండా ఐటీడీఏలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. అదేవిధంగా మండల కేంద్రంలో చాలా ఏళ్లుగా శిథిలావస్థలో ఉన్న ఐటీడీఏ క్వార్టర్స్‌కు మరమ్మతు పనులను చేపట్టి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. జిల్లాలో తొమ్మిది కోట్ల మహిళా సంఘాల ఖాతాల్లో వడ్డీ డబ్బును జమ చేశామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు రూ.26వేల కోట్లను అందించేందుకు ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే మహిళలు రూ.23వేల కోట్ల వడ్డీలేని రుణాలను పొందారని అన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం మహిళా సంఘాలకు రూ.3వేల కోట్ల పావలా వడ్డీ రుణాలు ఇస్తామని చెప్పి మాట తప్పారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చొరవతో మహిళా సంఘాలు అన్నిటికీ వడ్డీ డబ్బులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు మొదటగా రుణాలను అందించి ఆ తర్వాత ఆయా సంఘాల ఖాతాల్లో వడ్డీని జమ చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా రూ.15కోట్లతో ఐటీడీఏ కొత్త భవనాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. కొండాయిలో రూ.16 కోట్లతో బ్రిడ్జి నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఏజెన్సీ వాసుల చిరకాల ఆకాంక్ష అయిన బస్సు డిపో ఏర్పాటుకు టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని, నెలరోజుల్లో పనులను చేపడుతున్నామని అన్నారు. పదేళ్లపాటు ఎలాంటి పనులు చేపట్టని గత ప్రభుత్వం కాంగ్రెస్‌పై నిందలు వేయడం విడ్డూరమన్నారు. ప్రభుత్వం ఏర్పడిన అతి తక్కువ కాలంలో జిల్లాలో పేరుకుపోయిన అన్ని సమస్యలనూ పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ తదితరులు పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ : ఒకరికి తీవ్ర గాయాలు

మహబూబాబాద్ రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మహబూబాబాద్‌లోని కలెక్టరేట్ కార్యాలయం సమీపంలో శనివారం చోటుచేసుకుంది. టౌన్ సీఐ దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ మండలం మాధవాపురం గ్రామానికి జర్పుల నర్సింహా తన ద్విచక్ర వాహనంపై మహబూబాబాద్‌కు ప్రతిరోజు కూలీ నిమిత్తం వచ్చి వెళ్తుంటాడు. రోజు లాగానే ఉదయం కూలీ పనుల నిమిత్తం ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై మహబూబాబాద్‌కు వస్తున్నాడు. ఈ క్రమంలో కలెక్టరేట్ కార్యాలయ సమీపంలోకి రాగానే మహబూబాబాద్ నుంచి సాలార్‌తండా వైపు వెళ్తున్న కారు అతివేగంగా నర్సింహా బైక్‌ను ఎదురుగా ఢీకొట్టింది. ఈ ఘటనలో నర్సింహాకు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు 108 ద్వారా చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి భార్య పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



రవీందర్ (ఫైల్)

కాటారం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో శనివారం చోటు చేసుకుంది. కాటారం ఎస్సై-2 శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... గంగారం గ్రామానికి చెందిన చల్ల రవీందర్(43) భార్య స్వర్ణలతో కలిసి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు. తనకున్న రెండెకరాలతో పాటు మరో 3.10 ఎకరాలను కౌలుకు తీసుకొని రవీందర్ వ్యయసాయం చేస్తున్నాడు. వరి, పత్తి పంటలు సాగు చేస్తున్నాడు. ప్రకృతి వైపరీత్యాలకు తోడు తెగుళ్లు ఆశించగా పంటల దిగుబడి సరిగా రాలేదు. దీంతో మొత్తం సుమారు రూ.10లక్షల అప్పు పేరుకుపోయింది. దాన్నెలా తీర్చాలనే మనస్తాపంతో శుక్రవారం రాత్రి రవీందర్ గడ్డి మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతడిని మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి వరంగల్‌కు రెఫర్ చేశారు. ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రవీందర్ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

కృష్ణ ఎక్స్‌ప్రెస్ రైలులో పొగలు

డోర్నకల్(మహబూబాబాద్ జిల్లా), మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న కృష్ణ ఎక్స్‌ప్రెస్‌లోని ఎస్-1 బోగీలో పొగలు రావడంతో రైలును డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో 15నిమిషాల పాటు శనివారం సాయంత్రం నిలిపివేశారు. దీంతో సమాచారం తెలుసుకున్న రైల్వే సీఎన్‌డబ్ల్యూ సిబ్బంది బోగీ వద్దకు చేరుకుని రైలును పరిశీలించారు. బ్రేక్ పట్టివేయడంతోనే పొగలు వచ్చినట్లు తెలిసింది. సిబ్బంది బ్రేక్‌ను సరిచేసిన అనంతరం రైలును యథావిధిగా పంపించారు. తొలుత విజయవాడ సమీపంలోని కొండపల్లి వద్ద ఇంజన్ ప్యాంట్ రాపిడికి గురికావడంతో రైలు ఇంజన్ ఆగిపోయింది. దీంతో అక్కడసైతం మరో ఇంజన్‌ను అమర్చి రైలును పంపించారు. రెండు సంఘటనలతో కృష్ణ ఎక్స్‌ప్రెస్ రెండున్నర గంటలకుపైగా ఆలస్యంగా నడిచింది.

నేడు డయల్ యువర్ డీఎం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ ఆర్టీసీ) బస్‌డిపోలో ఈనెల 30న డయల్ యువర్ డిపోమేనేజర్ ప్రోగ్రాం ఉంటుందని డీఎం ఎం.శివ ప్రసాద్ శనివారం తెలిపారు. డయల్ యువర్ కార్యక్రమం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందని తెలిపారు. సంస్థ అభివృద్ధికి జిల్లాలోని ప్రయాణికులు సెల్ నెంబర్: 9959226054కు అమూల్యమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు.

పేదల గుండె చప్పుడు ఎన్టీఆర్

• టీడీపీ పార్లమెంట్ కన్వీనర్ రాంచందర్‌రావు



గంధంపల్లిలో ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాంచందర్‌రావు

బయ్యారం,మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం తుద వరకు పోరాడిన నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) ప్రజల గుండె చప్పుడని టీడీపీ పార్లమెంట్ కన్వీనర్ కొండపల్లి రాంచందర్‌రావు కొనియాడారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం గంధంపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ నాడు తెలంగాణ గడ్డపై టీడీపీ స్థాపించిన ఎన్టీఆర్ పేదలకు రేషన్ ద్వారా రెండు రూపాయలకే కేజీ బియ్యం, జనతా వస్త్రాలు, స్త్రీలకు ఆస్తిలో సమాన హక్కు, మండల వ్యవస్థ లాంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు శ్రీను, పాపారావు, శివ, రాజారావు, వెంకటేశ్వరరావు, శేషగిరి పాల్గొన్నారు.

కాటారం రేంజ్ అడవుల్లోకి పెద్ద పులి



కాటారం రేంజ్ అడవుల్లో పులి పాదముద్ర

కాటారం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : కాటారం రేంజ్ అడవుల్లో పెద్దపులి మళ్లీ కలవరపెడుతోంది. వంట చెరుకు తేవడానికి శనివారం తెల్లవారుజామున ఎడ్లబండిలో అడవికి వెళ్లిన గుమ్మళ్లపల్లి వాసులు సారయ్య, రాజుకు ఒడిపిలవంచ ఎర్రచెరువు సమీపంలో నీళ్లు తాగి వెళ్తున్న పులి ఎదురైంది. దీంతో వారు భయాందోళనలతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కేకలు వేశారు. చెరువు వైపు కాలకృత్యాల కోసం వచ్చిన ఒడిపిలవంచ గ్రామస్థులు ఇద్దరు సైతం కేకలు వేయడంతో పులి అడవి లోపలికి వెళ్లిపోయింది. దీంతో వంట చెరుకు మాట దేవుడెరుగు ప్రాణాలు దక్కాయంటూ సారయ్య, రాజు ఎడ్లబండిని తిప్పుకొని తిరిగి ఇంట్లో వచ్చిపడ్డారు. ఈవిషయం తెలిసి కాటారం రేంజర్ స్వాతి, డిప్యూటీ రేంజర్ సురేందర్, బేస్ క్యాంప్ సిబ్బంది రాజు తదితరులు అడవుల్లోకి వెళ్లి పులి జాడ కోసం వెతికారు. వారికి పులి పాదముద్రలు కనిపించాయి. పులి గూడూరు, వీరాపూర్ అడవుల వైపు వెళ్తున్నట్లు పాదముద్రల ద్వారా గుర్తించారు. పది రోజుల క్రితం వరకు కాటారం, మహదేవపూర్ రేంజ్‌ల అడవుల్లో సంచరించి యామన్‌పల్లి రేంజ్ మీదుగా జిల్లా సరిహద్దుల వైపు వెళ్లిన మగ పులే తిరిగి కాటారం రేంజ్ అడవుల్లోకి వచ్చినట్లు తెలుస్తోంది. గతంలో సంచరించిన పులే మళ్లీ వచ్చినట్లు పాదముద్రల ద్వారా తెలుస్తోందని అటవీ శాఖ అధికారులు అంటున్నారు. ఈనేపథ్యంలో అడవుల్లో ఉపాధిహామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలకు అధికారులు అవగాహన కల్పించి హెచ్చరించారు. పులి సంచరిస్తున్న దృష్ట్యా ఎవరూ అడవుల్లోకి వెళ్లొద్దన్నారు.

కేసీఆర్ విధానాలనే రేవంత్‌రెడ్డి అవలంబిస్తున్నారు

• సమగ్ర సర్వే రిపోర్టులను ఎందుకు బహిర్గతం చేయలేదు..
• ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు వడ్త్యా దాసురాంనాయక్



సభలో అభివాదం చేస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

నెహ్రూసెంటర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత ఏర్పడిన ప్రభుత్వంలో కేసీఆర్ విధానాలనే నేటి కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి అవలంబిస్తున్నారని లంబాడీ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) జాతీయ అధ్యక్షుడు వడ్త్యా దాసురాంనాయక్ ఆరోపించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పేరాల కట్టయ్య ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన ఎల్‌హెచ్‌పీఎస్ మానుకోట సభ ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బానోత్ రమేష్‌నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్‌ప్రభుత్వంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా సమగ్రకుటుంబ సర్వేను చేయించారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో సమగ్ర కుల గణన సర్వే చేయించారని కానీ, ఆ సర్వే రిపోర్టులను ఎందుకు బహిర్గతం చేయలేదని ప్రశ్నించారు. కులాల వారీగా జనాబా లెక్కలను బహిర్గతం చేసి డిక్లరేషన్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. కానీ, కేసీఆర్ ప్రభుత్వంలో వాటిని బహిర్గతం చేయకపోగా.. నేటి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలోనూ బహిర్గతం చేయకపోవడం కేసీఆర్ అవలంబించిన విధానాన్ని రేవంత్‌రెడ్డి కూడా తూచా తప్పకుండా అవలంబిస్తున్నారని పేర్కొన్నారు. ఏజెన్సీలో గిరిజనులు పోడు భూముల సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వాటికి ప్రభుత్వాలు పరిష్కారం చూపకుండా కులాల మధ్య చిచ్చు పెడుతున్నాయని పేర్కొన్నారు. ఏజెన్సీలో కనీసం నడవడానికి తారురోడ్లు, సీసీ రోడ్లు లాంటి సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు భీమానాయక్, తేజావత్ వాసునాయక్, శాంతిబాయి, భూక్య రాజేష్ నాయక్, బాలాజీ నాయక్, మాజీ కౌన్సిలర్ భూక్య శ్రీనునాయక్ పాల్గొన్నారు.

నేటినుంచి శ్రీరామాలయంలో నవరాత్రి ఉత్సవాలు

• హాజరుకానున్న మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్



మహబూబాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శ్రీసీతారాముల కల్యాణ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న మురళీనాయక్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీ రామాలయంలో తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం అయిన ఆదివారం నుంచి ఏప్రిల్ 6 వరకు శ్రీసీతారామ కల్యాణ వసంత నవరాత్రి మహోత్సవాలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా మానుకోటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం 67వ శ్రీసీతారామ కల్యాణ వసంత నవరాత్రి మహోత్సవాల కరపత్రాలను ఎమ్మెల్యేతో పాటు, కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీసీతారామ కల్యాణవసంత నవరాత్రి మహోత్సవాలను కమిటీ సభ్యులు విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. అర్చకులు తాటిపాముల నర్సింహమూర్తి, రాధాకృష్ణమూర్తిలచే వేదమంత్రోచ్ఛరణల నడుమ 30న ఉగాది పండుగ రోజున పట్టణంలో శ్రీసీతారామ, లక్ష్మణ, అంజనేయ ఉత్సవ విగ్రహాల ఊరేగింపు మంటవ ప్రవేశ పూజాకార్యక్రమాలుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు ముఖ్య అతిథిలుగా ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ హాజరుకానున్నారు. సాయంత్రం 6.30 గంటలకు అర్చకులతో పంచాంగ శ్రవణం, ఉగాది కవి సమ్మేళనం ఉంటుందని పేర్కొన్నారు. 31న భాగవత అవతరణ, ఏప్రిల్ 1న భీష్మస్తవం-భగవద్గీతావతరణ, 2న పరీక్షిత్తుకు భాగవత బోధన, శ్రీ కృష్ణలీలలు, 3 క్షీరసాగర మథనం, 4న రామాయణ బాలకాండ-విశ్వామిత్ర యాగసంరక్షణ, 5న రామాయణ బాలకాండ-సీతాకళ్యాణము, 6న మధ్యాహ్నం 11.52 గంటలకు శ్రీసీతారామ చంద్రస్వామి కల్యాణ మహోత్సవం ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ బాధ్యులు చౌడవరపు మోహన్‌రావు, ఓంనారాయణలోయ, డాక్టర్ ఇంద్రసేనారెడ్డి, లక్ష్మీనారాయణ, ప్రవీణ్‌కుమార్, గురునాథరావు, రాజుగౌడ్, ఎడ్ల రమేష్, సురేష్, రాజేశ్వర్‌రావు, గిరిధర్‌గుప్తా, రాజు, లక్ష్మీనర్సింహరావు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో ముందస్తు ఉగాది వేడుకలు..

మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని శనిగపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు దాశరథి శ్రీధర్ నేతృత్వంలో ఉగాది వేడుకలు నిర్వహించి పండుగ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకన్న, ప్రభాకర్, పర్వతాలు, చైతన్య, కీర్తన, కమల, స్వాతి, చాందిని పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు శ్రీనివాస్, అనిల్, సాంబశివరావు, అన్నపూర్ణ, సుమన్, హతిరాం, కాశిం, నాగరాజు, నరేష్ పాల్గొన్నారు. మానుకోట పట్టణంలోని బ్యాంకు కాలనీలోని సంస్థ కార్యాలయంలో శుభోదయం సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉగాది పర్వదినాన కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కవి సమ్మేళనంలో పాల్గొనే రచయితలు సెల్ నెంబర్ : 90002 45448ను సంప్రదించాలన్నారు.

ఎగ్జామ్ సెంటర్ బయటే ఫోన్లు!

• 'ఆంధ్రజ్యోతి' కథనంపై పోలీసుల దర్యాప్తు ముమ్మరం

ములుగు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా జిల్లాకేంద్రంలోని పదో తరగతి పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు తీసుకువెళ్లడమే కాకుండా అభ్యంతరం తెలిపిన పోలీసు అధికారులపై వాగ్వాదానికి దిగిన చీఫ్ సూపరింటెండెంట్ ఎట్టకేలకు దారిలోకి వచ్చారు. శనివారం నాటి పరీక్ష నిర్వహణ విధులకు హాజరైన సదరు సీఎస్ తనతోపాటు ఇన్విజిలేటర్ల ఫోన్‌లను గేటు వద్దే పోలీసులకు అప్పగించారు. 'పదో తరగతి పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం స్థానికంగా చర్చనీయాంశమైంది. బందోబస్తు విధుల్లో ఉన్న సీఐ శంకర్ పట్ల చీఫ్ సూపరింటెండెంట్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడాన్ని పోలీసు అధికారులు సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. విధులకు ఆటంకం కలిగించారనే కోణంలో సదరు సీఎస్‌పై చర్యలు తీసుకునే అవకాశమున్నట్లు సమాచారం. కాగా, ఈ పరీక్షా కేంద్రంలో మొత్తం 150 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు. ఇన్ని రోజులు మొబైల్ ఫోన్‌లను పరీక్షా కేంద్రంలోకి తీసుకువెళ్లిన సీఎస్, ఇన్విజిలేషన్ సిబ్బంది ప్రశ్నాపత్రాలను ఏమైనా లీక్ చేశారా..? ప్రైవేటు విద్యాసంస్థలతో లోపాయికారి సహకారం కోసం సంప్రదించారా..? అనే కోణాల్లో నిఘా వర్గాలు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. మరో వారం రోజుల్లో ఈ అంశంపై నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు అందజేసేందుకు పోలీసు ఇంటలీజెన్స్, స్పెషల్ బ్రాంచ్ అధికారులు చర్యలు ముమ్మరం చేశారు.


విశ్వావసు ఉషస్సులో..

నేడు ఉగాది పర్వదినం

తెలుగు కొత్త సంవత్సరం ప్రారంభం

ఆలయాల్లో పంచాంగ శ్రవణాలకు ఏర్పాట్లు

పూజా సామగ్రి కొనుగోలుతో సందడిగా కూడళ్లు



హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల కొత్త సంవత్సరం ఉగాది పర్వదినం చైత్ర శుద్ధ పాడ్యమి ఆదివారం రోజున ప్రజలు జరుపుకోనున్నారు. ఈ ఏడాది ఉగాది పర్వదినం శ్రీవిశ్వావసు నామంతో ప్రారంభమవుతుంది. చైత్రమాసం కొత్త సంవత్సరం ఆదివారంతో ప్రారంభమవుతుంది. కొత్త సంవత్సరం సందర్భంగా మామిడి తోరణాలతో, పూల మాలలతో తమ ఇంటిని అలంకరించుకొని దేవాలయాలను కూడా అలంకరించి కొత్త సంవత్సరం ఆలయ దర్శనాలు చేసుకోవడం సంప్రదాయంగా భావిస్తారు.

పచ్చడి

ఉగాది పర్వదినం రోజున కష్టం, సుఖం, తీపి, చేదు, ఒగరు రుచులతో షడ్రుచుల పదార్థాలతో తయారు చేసిన మిశ్రమాన్ని ప్రసాదంగా స్వీకరిస్తారు. కొత్త సంవత్సరం ఉగాది రోజున ఉగాది పచ్చడి తీసుకోవడం ప్రతీ ఒక్కరి ఇంట్లో ఆచారంగా వస్తున్న పండుగ. చైత్రమాసంలో ప్రకృతి సిద్ధపరంగా కొత్త చింతపండు, కొత్తగా కాసిన మామిడికాయ, వసంత రుతువులో పూజిన యాపపువ్వు, మంచినీరు, బెల్లంతో కలిపి జీవితంలో ఒడిదొడుకులు సుఖ దుఃఖాల మాదిరిగా అన్ని కలిపితే ఒకే విధంగా ఉండడంగా కొత్త సంవత్సరం రోజున ఉగాది పచ్చడిని కొత్త కుండలో తయారు చేసుకొని ప్రతీ ఇంట్లో పచ్చడి స్వీకరిస్తారు. కొత్త కుండలో చింతపండు, మామిడికాయ, బెల్లం, వేప పువ్వు, మంచినీటి ద్రవంతో పచ్చడి పదార్థాన్ని తయారు చేసి ఉగాది రోజున నూతన వస్త్రాలు ధరించి పచ్చడి స్వీకరించి పండుగ స్పెషల్ అయిన బొబ్బట్లు (భక్ష్యాల)ను పిండి పదార్థాలను ఇంటిల్లిపాది ఆనందంగా ఆరగిస్తారు.

పంచాంగ శ్రవణాలు

ఉగాది కొత్త సంవత్సరం ప్రారంభం సందర్భంగా రాబోయే సంవత్సర కాలంలో తమ రాశీఫలాలు ఎలా ఉన్నాయనేది పంచాంగశ్రవణం ద్వారా పండితులు ఉగాది రోజున శ్రవణం చేస్తారు. జిల్లాలోని చారిత్రక శ్రీభద్రకాళి అమ్మవారి దేవాలయం, గీతాభవన్, బట్టల బజార్‌లోని శ్రీవేంకటేశ్వరాలయం, ఎల్లంబజార్‌లోని రామాలయం, ఎంజీరోడ్డులో గల గోపాలస్వామి గుడి, గురుధామం, వాసవీమాత దేవాలయం, దత్తక్షేత్రం, శివనగర్‌లోని రామాలయం, కాశీబుగ్గ దేవాలయం, ఆకారపు వారి గుడితో పాటు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు.

వేయిస్తంభాల ఆలయంలో..

ఉగాది పర్వదిన వేళ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో సాయంత్రం ఐనవోలు రాధాకృష్ణ సిద్ధాంతిచే పంచాంగ శ్రవణం, తాడూరి రేణుక శిష్యబృందంచే సాంస్కృతిక సంప్రదాయ నృత్యాలు, ప్రత్యేక 12 మంది కవులతో ప్రత్యేక కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో అనిల్ కుమార్, ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ చెప్పారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకలను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు పాల్గొని ప్రారంభిస్తారని వారు చెప్పారు. పది రోజులపాటు జరిగే శ్రీరామ నవమి నవరాత్రి ఉత్సవాలు ఆదివారం నుంచి ఇక్కడ ఆరంభం కానున్నాయి.



హనుమకొండ చౌరస్తాలో ఉగాది పండుగ సందర్భంగా సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు

పూజా సామగ్రి కొనుగోలు సందడి

ఉగాది పర్వదినం సందర్భంగా పూజా సామగ్రి అమ్మకాలు జోరుగా సాగుతాయి. ఈ మేరకు శనివారం నగరంలో పెద్ద ఎత్తున పూలు, పండ్లు, మామిడి కాయలు, కొత్త చింతపండు, వేప పువ్వు, మామిడి ఆకు, ఇతర పూజా సామగ్రిని ప్రజలు కొనుగోలు చేశారు. వరంగల్ చౌరస్తా, స్టేషన్ రోడ్డు, పోస్టాఫీస్ సెంటర్, బట్టల బజార్, చమన్, జేపీఎన్ రోడ్డు, పోచమ్మ మైదాన్, కాశిబుగ్గ, రంగశాయిపేట, తదితర ప్రాంతాల్లో పూజ సామగ్రి అమ్మకాలు జోరందుకున్నాయి. ఎక్కడ చూసినా తోరణాలు కట్టేందుకు మామిడాకులు, బంతిపూల అమ్మకాలు, పచ్చడి తయారు చేసుకునేందుకు కుండలు, రంజన్లతో నగరమంతా ఉగాదిమయమైంది.

ప్రముఖుల శుభాకాంక్షలు

ఉగాది నూతన తెలుగు సంవత్సరంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వరంగల్ ఎంపీ కడియం కావ్య కోరారు. ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఉగాది పండుగను జిల్లా ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య శనివారం ఒక ప్రకటనలో కోరారు. తెలిపారు.

కవి సమ్మేళనాలు

ప్రత్యేక కవి సమ్మేళనాలు, పంచాంగ శ్రవణాలు రెండు రోజులుగా కొనసాగుతూనే ఉన్నాయి. ఆదివారం పర్వదిన వేళ కూడా అనేక చోట్ల కవి సమ్మేళనాలు ఏర్పాటు అయ్యాయి. హనుమకొండలోని సహృదయ సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం వడ్డెపల్లి రోడ్‌లోని పీఆర్.రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో విశ్వావసు ఉగాది వేడుకలు పెద్దఎత్తున నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు గిరిజా మనోహర్‌బాబు, కార్యదర్శి కుందావజ్జుల కృష్ణమూర్తి చెప్పారు. నమిలిగొండ విశ్వేశ్వరశర్మచే పంచాంగ పఠనంతోపాటు స్వరవిపంచి పేరిట సిద్ధిపేటకు చెందిన శశిధర్‌శర్మ బృందంచే ప్రత్యేక లలిత సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే విధంగా రంగశాయిపేటలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో చేపూరి శ్రీరామ్ అష్టవధానంతోపాటు ప్రత్యేక ఉగాది సమ్మేళనం నిర్వహిస్తున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో హిందూ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విశ్వావసు నామ ఉగాది వేళ పంచాంగ శ్రవణాలు నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు రామిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. టీటీడీ కల్యాణ మండపంలో యోగా గురువు బాబురావు, ధర్మప్రచార మండలి సభ్యులు దేవేందర్‌రెడ్డి, టీటీడీ కల్యాణ మండప మేనేజర్ రఘువీర్‌లతో కలిసి ఈ సందర్భంగా కార్యక్రమ వివరాల పత్రిక ఆవిష్కరించారు. సముద్రాల శఠగోపాచార్యచే టీటీడీ కల్యాణ మండపంలో ప్రంచాంగ శ్రవణం ఉంటుందని ఉమ్మడి జిల్లాలోని ఆరు కేంద్రాల్లో ప్రత్యేక పంచాంగ శ్రవణాలు నిర్వహిస్తున్నట్లు కృష్ణమూర్తి తెలిపారు.



కేయూ బడ్జెట్ రూ.428.82 కోట్లు



వర్సిటీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్



కేయూ అకడమిక్ సెనెట్ సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ప్రొఫెసర్ సురేశ్‌లాల్, ఎఫ్ఓ రాజయ్య

కేయూ క్యాంపస్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ 2025-26 ఏడాది బడ్జెట్ రూ.428.82కోట్లతో అంచనా బడ్జెట్‌ను ప్రతిపాదించింది. వర్సిటీకి వచ్చే ఆర్థిక ఏడాదిలో ప్రభుత్వ ప్రభుత్వ గ్రాంట్ల రూపంలో రూ.195.62కోట్లు, అలాగే ఇతర వనరుల నుంచి రూ.170.55 కోట్ల మేరకు వనరులు వస్తాయని అంచనాలు వేశారు. వీటిలో వర్సిటీ ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షనలు, భత్యాలు, నిర్వహణ ఖర్చులు, పరీక్షలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ఇతర ఖర్చులకు రూ.369.21కోట్లకు అంచనాలు రూపొందించారు. వర్సిటీ లోటు బడ్జెట్ రూ.2.45కోట్లుగా చూపారు. శనివారం కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షత జరిగిన 40వ అకడమిక్ సెనెట్ సమావేశం జరిగింది. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, పాలకమండలి సభ్యులు డాక్టర్ నిమ్మ సుదర్శన్, డాక్టర్ కారుకాల అనితారెడ్డి, డాక్టర్ పుల్లూరు సుధాకర్, అడ్వకేట్ బాలు చౌహాన్, డాక్టర్ బి.రమ, డాక్టర్ సుకుమారి, డాక్టర్ నవీన్‌తో పాటు అకడమిక్ సెనెట్ సభ్యులు డాక్టర్ అంపశయ్య నవీన్, మాణిక్యం, మాజీ వీసీలు ప్రొఫెసర్ వంగాల గోపాల్‌రెడ్డి, ప్రొఫెసర్ ఎన్.లింగమూర్తి, ప్రొఫెసర్ విద్యావతితో పాటు డీన్లు, ఇతర పరిపాలన అధికారుల సమక్షంలో బడ్జెట్ ప్రవేశపెట్టారు.

సభలో కేయూ అర్థశాస్త్ర విభాగాధిపతి, పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ వర్సిటీ బడ్జెట్‌ను ప్రతిపాదించారు. మొత్తంగా బడ్జెట్ రూ.428.82 కోట్లుగా ప్రతిపాదించగా, అందులో ఖర్చులకు రూ.369.21 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్స్ రూపంలో రూ.195.62 కోట్లుగా ప్రతిపాదించారు. వర్సిటీకి ఇతర వనరుల నుంచి రూ.170.55 కోట్ల రాబడి వస్తోందని అంచనాలు వేశారు. వీటిలో యూజీసీ ఏరియర్స్‌గా రూ.32.81కోట్లు, అకడమిక్, ట్యూషన్ ఫీజులు రూ.8కోట్లు, అంతర్గత వనరుల రూపంలో రూ. 41.80 కోట్లు, పరీక్షల విభాగం నుంచి రూ.50.06కోట్ల మేరకు వర్సిటీకి ఆర్థిక వనరులు సమాకురుతాయని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. బడ్జెట్‌ను మొత్తంగా 8 విభాగాలుగా ప్రొఫెసర్ సురేశ్‌లాల్ చూపారు. రూ.2.45 కోట్లు లోటు ఏర్పడుతోందని పేర్కొన్నారు. ఉద్యోగుల జీతాలు, పెన్షన్‌లకు రూ. 211.41కోట్లు, నిర్వహణ కార్యక్రమాలకు రూ.8.80కోట్లు, పరీక్షలకు రూ. 50.06 కోట్లు మేరకు నిధులను కేటాయించినట్లు వివరించారు. అకడమిక్ కార్యక్రమాలకు రూ.8.36కోట్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు రూ.84.38 కోట్లు నిధులను వెచ్చిస్తున్నట్లు స్పష్టం చేశారు. బడ్జెట్‌పై చర్చల్లో పాల్గొన్న పాలక మండలి సభ్యులు, డీన్లు, ఇతర పరిపాలన అధికారులు కేయూ 2025-26 బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు.

కేయూను డిజిటలైజేషన్ చేస్తాం..

కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ 2026లో స్వర్ణోత్సవ సంబురాలకు సిద్ధమవుతోందని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి వెల్లడించారు. శనివారం కేయూ 40వ అకడమిక్ సెనెట్ సమావేశంలో అధ్యక్షత వహించి కీలక రిపోర్టును సమర్పిస్తూ ప్రసంగించారు. వర్సిటీ అభివృద్ధిలో అందరి కృషి ఉందన్నారు. బాధ్యతతో వర్సిటీని మరింత ముందుకు తీసుకుపోదామన్నారు. నూతన విద్యావిధానంలో భాగంగా కొత్త కోర్సులను తెస్తామన్నారు. బోర్డు ఆఫ్ స్టడీస్‌లను బలోపేతం చేస్తామని, వర్సిటీని డిజిటలీకరణ చేస్తామన్నారు. 10 ఏళ్లలో వర్సిటీలో 3వేల రీసెర్చ్ పేపర్లు గొప్ప జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయన్నారు. 5 ఏళ్లలో 65 పరిశోధన ప్రాజెక్టులతో పాటు 85 మంది స్టూడెంట్స్ జాతీయ అర్హత పరీక్షల్లో ప్రతిభ చూపారని పేర్కొన్నారు. రుసా నిధులు, ప్రాజెక్టులతో పాటు డిపార్టుమెంట్ ప్రాజెక్టులు వచ్చాయన్నారు. కె-హబ్‌ను ఉపయోగంలోకి తెస్తామని చెప్పారు. 6వ జనరేషన్, మెషిన్ లర్నింగ్, మార్కెట్ ఓరియంటేషన్ కోర్సులను తెస్తామన్నారు. న్యాక్ ఏ ప్లస్, ఎన్ఐఆర్ఎఫ్, యూఐ గ్రీన్ మెట్రిక్ ర్యాంకులు సాధించమని పేర్కొన్నారు. వర్సిటీ పరిధిలోని కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలలో అలూమినీ సహకారంతో అకడమిక్ బ్లాక్‌ను నిర్మించినట్లు తెలిపారు. జెన్‌కో రూ.కోటి, ఇన్ఫోసిస్ 300 కంప్యూటర్లను అందచేసినట్లు చెప్పారు. హరితహారంలో 11వేల మొక్కలు, ఎన్ఎస్ఎస్‌లో రక్తదాన శిబిరాలు నిర్వహించమన్నారు. ఇంజనీరింగ్, కామర్స్ కళాశాలలో 285 మంది విద్యార్థులు క్యాంపస్ సెలక్షన్‌లో ఉద్యోగాలు సాధించినట్లు వెల్లడించారు.

అలాగే మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సెలబస్‌లో మార్పులు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు చేస్తామని వీసీ పేర్కొన్నారు. విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా టీచింగ్ ఏర్పాట్లు చేస్తామని, నూతన నియామకాలు చేపడుతామని పేర్కొన్నారు. అలూమినీలను బలోపేతం నిధులను సేకరిస్తామన్నారు. అలూమినీ ఫండ్, కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తామన్నారు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.293కోట్లతో డీపీఆర్‌ను సిద్ధం చేశామని వెల్లడించారు. బోధన, పరిశోధనపై శ్రద్ధ వహించాలని వీసీ సూచించారు.



మాజీ వీసీ ప్రొఫెసర్ విద్యావతి



మాజీ వీసీ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి



మాజీ వీసీ ప్రొఫెసర్ లింగమూర్తి



సెనెట్ సభ్యుడు అంపశయ్య నవీన్



పాలక మండలి సభ్యుడు పుల్లూరి సుధాకర్

బడ్జెట్ వాస్తవికంగా రూపొందించాలి

కేయూ బడ్జెట్ వాస్తవికం గా రూపొందించాలని కేయూ పాలక మండలి సభ్యులు పుల్లూరి సుధాకర్ సూచించారు. శనివారం కేయూ బడ్జెట్‌పై జరిగిన చర్చల్లో పాల్గొని కీలక సూచనలు, సలహాలను ఇచ్చారు. బడ్జెట్ సంప్రదాయక పద్ధతులపై ఆధారపడకుండా, ఇతర వనరుల నుంచి ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. మరో పాలక మండలి సభ్యులు, అడ్వకేట్ బాలు చౌహన్ మాట్లాడుతూ.. గతంలో పోల్చితే తాజాగా ప్రభుత్వం కేయూకిచ్చిన బ్లాక్‌గ్రాంట్ ఆశాజనకంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో రాష్ట్రంలోనే వర్సిటీని టాప్‌కు తీసుకుపో వాలని అన్నారు. విద్యార్థులలో భవిష్యత్‌లో మార్పులు తీసుకువచ్చేందు కు అధ్యాపకులు మరింతగా కృషి చేయాలన్నారు. ఈసీ మెంబర్ డాక్టర్ కారుకల అనితారెడ్డి మాట్లాడుతూ.. వర్సిటీలో అనేక పరిమితుల మధ్య బడ్జెట్‌ను గొప్పగా రూపొందించారని పేర్కొన్నారు. వర్సిటీని రక్షించుకో వాలని కోరారు. పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్రా రాజుగౌడ్ మాట్లాడుతూ.. బ్లాక్ గ్రాంట్ పెంచినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ వీసీ ప్రొఫెసర్ విద్యావతి మాట్లాడుతూ.. వర్సిటీలో ప్రొఫెసర్ల సంఖ్య తగ్గిపోతుందని, విభాగాధిపతులు కాంట్రాక్టు అధ్యాపకులు ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్డు ప్రొఫెసర్లకు రీసెర్చ్ అవకాశం కల్పించాలని కోరారు. మాజీ వీసీ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో పోలిస్తే తాజా ప్రభుత్వానికి వర్సిటీలపై సానుకూల దృక్పథం ఉందన్నారు. ఎస్డీఎల్‌సీఈ, ఎస్ఎఫ్‌సీ కోర్సులను బలోపేతం చేయాలన్నారు. టీం వర్క్‌తో వర్సిటీ అభివృద్ధికి కృషి జరుగాలని పేర్కొన్నారు. మాజీ వీసీ ప్రొఫెసర్ ఎన్.లింగమూర్తి మాట్లాడుతూ.. నియామకాలు జరగాలని, బ్లాక్‌గ్రాంట్ పెరుగాలని అన్నారు. నాణ్యమైన విద్య అందించాలన్నారు. ప్రముఖ రచయిత, సెనెట్ సభ్యుడు డాక్టర్ అంపశయ్య నవీన్ మాట్లాడుతూ.. స్మారక ఉపన్యాసాలను ఏటేటా నిర్వహించేలా చూడాలన్నారు. సెనెట్ సభ్యుడు మాణిక్యం, సైన్స్ డీన్ ప్రొఫెసర్ జి. హన్మంతు, ఎడ్యుకేషన్ డీన్ ప్రొఫెసర్ రాంనాథ్‌కిషన్‌లు మాట్లాడుతూ.. వర్సిటీ అభివృద్ధిపై కీలక సూచనలు చేశారు.

ఈ సమావేశంలో డీన్లు ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, గాదె సమ్మయ్య, ఎం.శ్రీనివాస్, మంచాల సదానందం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాజేందర్ కట్ల, యూజీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, అకూట్ అధ్యక్షులు ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి, ప్రిన్సిపాల్ సుంకరి జ్యోతి, తిరుమలదేవి, వెంకయ్య, ఈసం నారాయణ, తదితరులు పాల్గొన్నారు. సభలో రిటైర్డు కానున్న తోట రాజయ్య దంపతులను సన్మానించారు.

సర్వర్ డౌన్..



రాజీవ్ యువ వికాస పథకం దరఖాస్తుదారులతో కిటకిటలాడుతున్న సంగెంలోని మీ సేవా కేంద్రం

- మీ సేవా కేంద్రాల్లో సర్వర్ సమస్య
- ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం
- తిరుగుతున్న యువవికాస దరఖాస్తుదారులు
- ఏప్రిల్ 5కు గడువు పూర్తి

హనుమకొండ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలో వారం రోజులుగా మీసేవా కేంద్రాల్లో సర్వర్లు పని చేయడం లేదు. ఏ ధృవీకరణ పత్రాలు జారీ కావడం లేదు. రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తులు చేసుకునేందుకు కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాల కోసం నిరుద్యోగ యువతీ యువకులు మీ సేవా కేంద్రాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. అయినా ఫలితం ఉండడం లేదు. సైట్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యను పరిష్కరించడంలో అధికారులు చొరవ చూపడం లేదు.

అన్నిటికీ మీ సేవా కేంద్రమే..

కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు మొదలు కొని స్కాలర్‌షిప్‌ల వరకు ఇలా ప్రతీ అవసరానికి దరఖాస్తు చేసుకోవాలంటే మీ సేవా కేంద్రానికి వెళ్లక తప్పదు. మీ సేవా కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన తర్వాతే సంబంధిత కార్యాలయాల నుంచి ధృవీకరణ పత్రాలు జారీ అవుతాయి. ఈ సర్టిఫికెట్లను కూడా మీ సేవా కేంద్రాల నుంచే తీసుకోవాల్సి ఉంటుంది. ఈప్రక్రియ ఉమ్మడి జిల్లాలో వారం పాటు దాదాపుగా నిలిచిపోయింది.

సర్వర్ డౌన్

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండే మీ సేవా కేంద్రాల్లో వారం రోజులుగా సర్వర్ ఏకారణం వల్ల డౌన్ అయింది సమాధానం దొరకని ప్రశ్నగా మిగిలిపోయింది. ఏ మీ సేవా కేంద్రానికి వెళ్లినా ఆపరేటర్లు 'సారీ.. సర్వర్ డౌన్ అయింది..' అని చెప్పి చేతులు దులుపుకుంటున్నారు. వివిధ ధృవీకరణ పత్రాల కోసం వచ్చిన విద్యార్థులు, యువతీ యువకులు ఎంతసేపు ఎదురు చూసినా సర్వర్లు తిరిగి పని చేయడం లేదు, సర్టిఫికెట్ల కోసం వచ్చిన వారితో అన్ని కేంద్రాలు కిటకిటలాడుతూ కనిపిస్తున్నాయి. రాజీవ్ యువ వికాస పథకం కోసం దరఖాస్తులు చేసుకునే గడువు దగ్గర పడుతుండడం, అవసరమైన ధృవీకరణ పత్రాలు జారీ కాకపోవడంతో యువకులు ఆందోళన పడుతున్నారు. భూ సంబంధిత రికార్డులు, ఇతరత్రా అవసరాల కోసం మీ సేవా కేంద్రాలకు వెళుతున్న వారికి కూడా నిరాశే ఎదురవుతున్నది. కొత్తగా దరఖాస్తు చేసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతుండగా ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నవారు రెవెన్యూ కార్యాలయాల నుంచి తీసుకోవాల్సిన ధృవీకరణ పత్రాలు కూడా తీసుకునే పరిస్థితి లేదని వాపోతున్నారు. రోజు ఉదయం, సాయంత్రం మీ సేవా కేంద్రాల చుట్టూ తిరగడమే సరిపోతున్నదని అంటున్నారు.


చేతులెత్తేస్తున్న నిర్వాహకులు

సమస్య ఏమిటో మీ సేవా కేంద్రాల నిర్వాహకులు చెప్పలేకపోతున్నారు. సర్వర్‌లో లోపాలు ఉన్నాయని, లేదా సైట్‌లో సాంకేతిక సమస్య ఉందనో, అప్‌డేట్ చేసే పనిలో యంత్రాంగం ఉందనో అనుకోవడం తప్పా ఎవరూ సరైన సమాచారం ఇవ్వడం లేదని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ సర్వీస్‌ను మీ సేవకు అనుసంధానించిన అధికారులు సమస్య ఏమిటో చెప్పకపోవడంతో దరఖాస్తుదారులతో చీవాట్లు పడాల్సి వస్తోందని నిర్వాహకుల వాపోతున్నారు. సైట్‌లో సమస్య వల్ల అన్ని మీ సేవా కేంద్రాల్లో గుట్టగుట్టలుగా దరఖాస్తులు పేరుకుపోతున్నాయి. కుల, ఆదాయ, ధృవీకరణ పత్రాల దాఖలు కోసం చేసిన కొందరి దరఖాస్తులు ఆమోదం పొందినట్లు సందేశం వచ్చినా సర్వర్లో సమస్యతో సర్టిఫికెట్ మాత్రం డౌన్‌లోడ్ కావడం లేదు. హైదరాబాద్ మీసేవా స్టేట్ డాటా సెంటర్ (ఎస్‌డీఎస్)లో తలెత్తిన సాంకేతిక సమస్యే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

మీ సేవా కేంద్రాల్లో 38 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 204 రకాల సేవలు ప్రజలకు అందిస్తున్నారు. ఆ సేవల్ని పొందాలంటే మీ సేవ ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కుల, ఆదాయ, నివాసపత్రాలతో పాటు రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి ఈసీ పొందాలంటే సమీప సేవా కేంద్రాల్లో అందుకు సంబంధించి దరఖాస్తు చేసుకోవాలి. తహసీల్దార్ కార్యాలయాల్లో మాన్యువల్‌గా అందించే తొమ్మిది రకాల సర్టిఫికెట్లను సైతం ఇటీవల మీ సేవలో అందుబాటులోకి తెచ్చారు.

గడువు దాటుతోంది..

రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల స్వీకరణకు ఏప్రిల్ 5 చివరి తేదీ. ఆ తర్వాత ఏప్రిల్ 6 నుంచి 30 వరకు దరఖాస్తులను పరిశీలిస్తారు. అర్హులైన లబ్ధిదారులకు జూన్ 2న తెలంగాణ అవిర్భావ దినోత్సవం సందర్భంగా మంజూరు పత్రాలు అందజేస్తారు. ఈ పథకం కింద నిరుద్యోగ యువతకు రూ. 3 లక్షల వరకు ఆర్థిక సాయం అందజేస్తారు. ఈ పథకం కింద దరఖాస్తుతో పాటు తప్పనిసరిగా సమర్పించాల్సిన ధృవీకరణ పత్రాల్లో ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు ఉన్నాయి. ముఖ్యంగా దరఖాస్తుదారు తెలంగాణ శాశ్వత నివాసి అయి ఉండాలి. ఈ నివాస ధృవీకరణ పత్రం కొత్తగా తీసుకోవాలంటే వారికి చుక్కలు కనిపిస్తున్నాయి. అగ్రికల్చర్ యూనిట్‌కు దరఖాస్తు చేస్తే పట్టాదారు పాస్ బుక్ ఉండాలి. ట్రాన్స్‌పోర్టు వాహనానికి దరఖాస్తు చేస్తే డ్రైవింగ్ లైసెన్సు ఉండాలి. దివ్యాంగ అభ్యర్థులైతే సదరం సర్టిఫికెట్ జత చేయాలి. ఆన్‌లైన్ అప్లికేషన్ పూర్తయ్యాక దాన్ని డౌన్‌లోడ్ చేసుకొని ఎంపీడీవో లేదా మున్సిపల్ లేదా జోనల్ కార్యాలయాల్లో ఇవ్వాలి. ఇదంతా జరగాలంటే ముందు మీ సేవా కేంద్రాల్లో నుంచి ధృవీకరణ పత్రాలు రావాలి. అవి రావడంలో జాప్యం జరుగుతోంది. ఈ దృష్ట్యా దరఖాస్తుల దాఖలు గడువును పొడిగించాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.



విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

కేయూ క్యాంపస్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామని ఎన్నికల్లో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కారించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ రాంనగర్‌లో ఎస్ఎఫ్ఐ 3వ జిల్లా మహాసభలు జరిగాయి. సీతారాంఏచూరి ప్రాంగణం సుందరయ్య భవన్‌లో జరిగిన సభలకు ముఖ్యఅతిథిగా దామెర కిరణ్ హాజరై మాట్లాడారు. కేయూ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని, కోఠారి కమిషన్ సిఫార్సుల మేరకు బడ్జెట్‌లో 30 శాతం నిధులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతీ మండల కేంద్రంలో అంతర్జాతీయ స్థాయి స్కూల్స్ ఏర్పాటు చేయాలన్నారు. అద్దెభవనాల్లో నడుస్తున్న గురుకుల పాఠశాలలకు అద్దె చెల్లించాలని అన్నారు. పాఠ్యపుస్తకాలను సకాలంలో ముద్రించి విద్యార్థులకు అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియాంబర్స్‌మెంట్‌లు చెల్లించాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించాలని, ప్రైవేట్, కార్పోరేట్ ఫీజుల దోపిడీని అడ్డుకుని, విద్యాహక్కు చట్టాలన్నీ అమలు చేయాలని అన్నారు. ఫీజుల దోపిడీపై ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వ్యాప్తంగా కార్యాచరణ రూపొందించిన ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. సభల్లో ఎస్ఎఫ్ఐ హనుమకొండ అధ్యక్షకార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్, సూర్యం, బీరెడ్డి జస్వంత్, జిల్లా సహాయ కార్యదర్శులు ఎం.పరిమళ, సాయికుమార్, మడికొండ మేఘన, సన్నీ, అజయ్, మల్లేశ్, పవన్‌కుమార్, ఎమ్డీ ఇస్మాయిల్, అరుణ్, కుమార్, వరప్రసాద్, నిరోషా, ప్రతిమ, కావ్య, సందీప్, అఖిల్, కన్నారావు, రాజ్‌కుమార్, రత్నం, స్వాతి, వేణు, పృథ్వీ, నరేశ్, సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట రైల్వేస్టేషన్‌లో డ్రగ్ కంట్రోల్ టీం తనిఖీలు



డాగ్ స్క్వాడ్‌తో అనుమానితుల బ్యాగుల తనిఖీ చేస్తున్న దృశ్యం

వరంగల్ క్రైం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాల నియంత్రణలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ డ్రగ్ కంట్రోల్ టీం ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్‌తో వరంగల్ రైల్వేస్టేషన్‌లో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితుల బ్యాగ్‌లతో పాటు రైల్వేస్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఆర్ఐ శివకేశవులు, ఆర్ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆత్మగౌరవమే ప్రధానం

రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క

ఏటూరునాగారం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల ఆత్మగౌరవమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి ప్రధానమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూర్య సీతక్క అన్నారు. మండలంలో మంత్రి విస్తృతంగా శనివారం విస్తృతంగా పర్యటించారు. మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో సంక్షేమ శాఖ జిల్లా అధికారి శిరీష అధ్యక్షతన దివ్యాంగులకు వివిధ రకాల సహాయ ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ దివ్యాంగులలో ఆత్మ విశ్వాసాన్ని నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అర్హులైన దివ్యాంగులకు అలింకో సంస్థ సహకారంతో సహాయ ఉపకరణాలను అందిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, అందులో భాగంగానే వారికి ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగ అవకాశాల కోసం ప్రత్యేకంగా ఒక వెబ్ సైట్‌ను ఏర్పాటు చేసిందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం వంటి వివిధ సంక్షేమ పథకాల్లో ఐదు శాతం రిజర్వేషన్, అలాగే ఉద్యోగాల్లో నాలుగు శాతం రిజర్వేషన్ అందించే దిశగా ప్రభుత్వం అడుగేస్తోందని తెలిపారు. జిల్లాలోని ఏటూరునాగారం, గోవిందరావుపేట, తాడ్వాయి, మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాలకు చెందిన లబ్ధిదారులకు సహాయ ఉపకరణాలను అందించడం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు కలెక్టర్ దివవార తెలిపారు. అనంతరం మంత్రి అర్హులైన దివ్యాంగులకు రెట్రో ఫిట్టెడ్ ట్రై సైకిళ్లు, చేతితో నడిపే ట్రై సైకిళ్లు, వీల్ చైర్స్, వినికిడి యంత్రాలు, మూడు చక్రాల స్కూటర్లు, వివిధ రకాల చేతికర్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ఆర్డీవో వెంకటేశ్, ఐసీడీఎస్ సీడీపీవో ప్రేమలత, దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు పూజారి మాణిక్యం, భాస్కర్, వివిధ సెక్టార్ల ఐసీడీఎస్ సూపర్వైజర్లు, డీడబ్ల్యూవో కార్యాలయ అసిస్టెంట్‌లు, పార్టీ జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో నిర్మించిన శ్రీహరిహరపుత్ర ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయం విగ్రహ ప్రతిష్ఠ పోస్టర్‌ను మంత్రి సీతక్క ఆవిష్కరించారు. ఆలయంలో మండపం నిర్మాణానికి రూ. 5 లక్షల విరాళం ఇస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ కమిటీ చైర్మన్ బోలసాని గౌరీ శంకర్, వైస్ చైర్మన్ అల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బోడ సత్యం, గురు స్వాములు వసంత రమేష్, పెండ్యాల ప్రభాకర్, జూపాక అర్జున్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని మసీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు మంత్రి సీతక్క ముస్లిం పెద్దలతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జామా మసీద్ అధ్యక్షుడు ఎమ్డీ. వలీబాబా, ఉపాధ్యక్షుడు ఎమ్డీ. అజ్మత్ ఖాన్, ముస్లిం పెద్దలు ఎమ్డీ. ఖలీల్ ఖాన్, ఎమ్డీ. అప్సర్, కైసర్, ఎమ్డీ. ముజీబ్, ఎస్.కె రహీం, ఎమ్డీ. అన్వర్, సలీం, సర్దార్ పాషా తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న మంత్రి సీతక్క

మతాల మధ్య చిచ్చుపెడుతున్న బీజేపీ

ములుగు కలెక్టరేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కుల, మతాల మధ్య చిచ్చుపెడుతూ భారత రాజ్యాంగాన్ని మార్చాలని కుట్ర చేస్తోందని మంత్రి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ అధ్యక్షతన జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్ సన్నాహక సమావేశం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా సీతక్క హాజరయ్యారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి రాహుల్‌గాంధీ జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ నినాదానికి పిలుపు నిచ్చారన్నారు.అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు దేశ సమాజం క్షమించరానిదని అన్నారు. జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాన్ని క్షేత్రస్థాయిలో బలంగా తీసుకెళ్లాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. కార్యకర్తల పోరాటాల ఫలితంగానే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఏడాదికాలంలోనే 53వేల ఉద్యోగాలు కల్పించడం జరిగిందని, కార్యకర్తలు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి కైలేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, పార్టీ అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు, బ్లాక్, మండల అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఆర్చీ గేటు పనుల ప్రారంభం

మహదేవపూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : సరస్వతీ పుష్కరాలకు రూ.25 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా పుష్కరఘాట్ వద్ద రూ.40 లక్షలతో ఆర్చీ గేటు నిర్మాణానికి శనివారం ముగ్గులు పోశారు. దీంతోపాటు వీఐపీ ఘాట్ వద్ద అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, దేవాదాయ శాఖ ఏఈతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐతో అభ్యసన సామర్థ్యాలు పెంచాలి : డీఈవో



కంప్యూటర్ ల్యాబ్‌లో విద్యార్థుల అభ్యసనను పరిశీలిస్తున్న డీఈవో

కాటారం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్-ఏఐ)తో చదువులో వెనకబడ్డ విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని భూపాలపల్లి డీఈవో రాజేందర్ అన్నారు. ఎఫ్ఎల్ఎన్ (ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం)లో భాగంగా మండలంలోని దేవరాంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన 'ఏఐ' కంప్యూటర్ ల్యాబ్‌ను ఎంఈవో శ్రీదేవితో కలిసి డీఈవో రాజేందర్ శనివారం ప్రారంభించారు. అనంతరం డీఈవో రాజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం వినూత్నంగా తీసుకొచ్చిన కృత్రిమ మేధతో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి చేపడుతున్న ఈ కార్యక్రమం బాష, గణిత సంబంధ భావనలు అర్థవంతంగా ఎక్కువకాలం గుర్తించుకోవడానికి ఉపయోగపడుతుందని అన్నారు. 3, 4, 5 తరగతుల్లో అభ్యసనపరంగా వెనుకబడిన విద్యార్థులకు మెరుగైన సామర్థ్యాలు, గణిత చతుర్విధ ప్రక్రియలు సాధించడానికి ఏఐ విద్యాబోధన ఉపయోగ పతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీదేవి, ఏఎంవో లక్ష్మణ్, డీసీఈబీ కార్యదర్శి మందల రవీందర్‌రెడ్డి, ధన్వాడ, దేవరంపల్లి హెచ్‌ఎంలు శ్రీదేవి, లక్ష్మణ్‌నాయక్, విజయ్‌బాబు, ఉపాధ్యాయులు భోజ్యానాయక్, తిరుపతి, లక్ష్మి, అనూష, కిషన్‌నాయక్, పరంసింగ్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో సర్వసభ్య సమావేశం

మహాముత్తారం, మార్చి29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఆరు నెలల కాలంలో పీఏసీఎస్ ద్వారా రైతులకతు అందించిన ఎరువులు, రుణాలపై సీఈవో మార్క శ్రీధర్ నివేదిక సమర్పించారు. అనంతరం చైర్మన్ సోమ శాంతకుమార్ మాట్లాడుతూ మండలంలోని బోర్లగూడెంలో మరో పీఏసీఎస్ ఏర్పాటు చేయాలని ఇప్పటికే అధికారులకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. అదేవిధంగా నూతన భవనంలోకి మారిన నేపథ్యంలో పాత భవనంలో రైతుల కోసం ఫర్టిలైజర్ షాపు ఏర్పాటు చేయడానికి తీర్మానించినట్లు తెలిపారు. సంఘం ద్వారా రైతుల కోసం ఒక రైసు మిల్లు, పెట్రోల్ బంకు, గ్యాస్ కేంద్రం ఏర్పాటుకు తీర్మానించినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీవో సీనియర్ ఇన్‌స్పెక్టర్ రెడ్డి, పీఏసీఏస్ వైస్ చైర్మన్ అనిల్‌రెడ్డి, సభ్యులు చిన్న రాజయ్య, సుజాత, భాస్కర్‌రెడ్డి, సమ్మక్క, రాజయ్య, మల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

స్ట్రక్చర్ మీటింగ్‌లో సింగరేణి జీఎంను కోరిన ఏఐటీయూసీ

కృష్ణకాలనీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధిలో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఇన్‌చార్జి జీఎం వెంకటరామిరెడ్డిని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి మోటపలుకుల రమేష్ కోరారు. శనివారం జీఎం కార్యాలయంలో జరిగిన స్ట్రక్చర్ మీటింగ్‌లో పలు సమస్యలను జీఎం దృష్టికి తీసుకెళ్లారు. కేటీకే 5 ఇన్‌క్లైన్ ఫిల్టర్ బెడ్ సివిల్ పరిధిలోకి తేవాలని, అన్ని గనుల్లో కాలం తీరిన కాఫ్ లాంప్ స్థానంలో ఎక్సీడ్ బ్యాటరీతో కూడిన లాంపులను అందుబాటులోకి తేవాలని కోరారు. ఆఫీసులో గనుల్లో కార్మికులు ఇచ్చిన రిప్రజంటేషన్ పరిష్కారానికి సిటిజన్ చార్ట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. వీటితో ప్రధానమైన మరికొన్ని సమస్యలను జీఎంకు సూచించగా వాటిపై సానుకూలంగా ఆయన స్పందించినట్లు రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సహాయ కార్యదర్శులు ఆసిఫ్‌పాషా, మధుగాని విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సెలూన్‌ను రద్దు చేయాలి

మల్హర్, మార్చి 29(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లిలో ఏర్పాటవుతున్న కార్పొరేట్ సెలూన్‌ను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు విజయగిరి సమ్మయ్య శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ వృత్తిపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న తమకు తీరని అన్యాయం జరుగుతుందని, ప్రభుత్వం స్పందించి సెలూన్ ఏర్పాటును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలించిన సింగరేణి ఇన్‌చార్జి జీఎం



స్విమ్మింగ్‌పూల్ సౌకర్యాలపై ఆరా తీస్తున్న జీఎం వెంకటరామిరెడ్డి

కృష్ణకాలనీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధిలోని కృష్ణకాలనీలో ఉన్న సింగరేణి స్విమ్మింగ్ పూల్‌ను ఇన్‌చార్జి జీఎం వెంకటరామిరెడ్డి శనివారం పరిశీలించారు. వేసవి కావడంతో చిన్నారులు అధికంగా స్విమ్మింగ్ పూల్‌కు వస్తున్న విషయం తెలిసిన ఆయన ఇక్కడ ఏర్పాటు చేసన సౌకర్యాలను పరిశీలించారు. స్వయంగా పలువురు చిన్నారులతో మాట్లాడి ఏర్పాట్లను, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పర్సనల్ మేనేజర్ మారుతి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శ్రావణ్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ పర్స శ్రీనివాస్, సేవా కోఆర్డినేటర్ ప్రవీణ్, స్విమ్మింగ్ కోచ్‌లు బి. తిరుపతి, పాక శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

తహసీల్దార్ లైంగికంగా వేధిస్తున్నాడు..

(7వ పేజీ తరువాయి)

వేధింపులకు పాల్పడేవాడంటూ ఆరోపణలు న్నాయి. మాట వినని ఉద్యోగులను సరెండర్ పేరిట ఇబ్బందుల పాలు చేసేవాడని తెలిసింది. ప్రతిపనికీ ఓ రేటు నిర్ణయించి ప్రజలను వేధిస్తున్నాడని కలెక్టర్‌కు గతంలో ఫిర్యాదులు అందినట్లు సమాచారం. ఇన్నాళ్లు తోటి ఉద్యోగులను ఇబ్బంది పెడుతూ వస్తున్న ఆ తహసీల్దార్.. ఇప్పుడు మహిళా ఉద్యోగిని లైంగికంగా వేధిస్తు న్నాడనే వస్తున్న ఆరోపణ హాట్ టాపిక్‌గా మారిం ది. ఈ విషయాన్ని కలెక్టర్ రాహుల్ శర్మ సీరియస్‌గా తీసుకున్నారని తెలిసింది. బాధిత మహిళా ఉద్యోగి ఫిర్యాదు నేప థ్యంలో ఆయన సమగ్ర విచారణకు ఆదేశా లు జారీ చేసినట్టు సమాచారం.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

ఎమ్మెల్యే సత్యనారాయణరావు



చిట్యాలలో ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చిట్యాల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని మసీదు ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఉపవాస దీక్షలో ఉన్న ముసింలకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విడిపించారు. కోఆప్షన్ మాజీ సభ్యుడు మహ్మద్ రాజ్‌మహ్మద్ ముస్లిం పెద్దలు అమ్జద్‌మియా, హైదర్‌పాషా, షఫీ, షేక్ హుస్సేన్, రంజాన్ అలీ, దస్తగిరి, జావిద్, సలీం, అహ్మద్, ఫక్రుద్దీన్, రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సత్యనారాయణరావు మండలంలోని 38 మందికి రూ. 11లక్షలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అంతకుముందు మండలంలోని కైలాపూర్ శివారు శాంతినగర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి సత్యనారాయణ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు గూట్ల తిరుపతి, గడ్డం కొమురయ్య, శంకర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ తిరుపతిరెడ్డి, దొడ్డి కిష్టయ్య, చిలుకల రాయకొంరు, టౌన్ అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్, గంగాదరి రవీందర్, అనిల్, శరత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి కృషి

మొగుళ్లపల్లి (ఆంధ్రజ్యోతి): ముస్లింల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలకేంద్రంలోని ముస్లిం కమిటీహాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ముస్లింలతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ సునీత, తహసీల్దార్ సునీత, ఎంపీడీవో హుస్సేన్, చిట్యాల ఏఎంసీ వైస్ చైర్మన్ ఎమ్డీ.రఫి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి నడిగోటి రాము, జిల్లా నాయకుడు తక్కళ్లపల్లి రాజు, పట్టణ అధ్యక్షుడు ఖ్యాతరాజు రమేష్, ముస్లింలు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బుట్టాయిగూడెంలో గంజాయి పట్టివేత?

కన్నాయిగూడెం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుట్టాయిగూడెం గ్రామం వద్ద ఉన్న తాటి చెట్ల సెంటర్ వద్ద శనివారం పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా ఒక వ్యక్తి వద్ద గంజాయి దొరికినట్లు తెలిసింది. బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై ఏటూరునాగారం వైపు నుంచి కన్నాయిగూడెం మండలంలోకి కొంత గంజాయిని తీసుకుని పలు గ్రామాల్లో అమ్మేందుకు వస్తున్న క్రమంలో గ్రామంలోని తాటి చెట్ల సెంటర్ వద్ద పట్టు బడినట్టు సమాచారం. పోలీసులు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని గంజాయిని ఎక్కడి నుంచి తీసుకొస్తున్నావు.. ఎక్కడికి తరలిస్తున్నావని విచారిస్తున్నట్లు తెలిసింది. దీనిపై స్థానిక పోలీసులను వివరణ కోసం సంప్రదించేందుకు ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

(7వ పేజీ తరువాయి)

సత్యనారాయణరెడ్డి, వెంకన్న, మాధవరావు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన

రేగొండ (ఆంధ్రజ్యోతి) : కొత్తపల్లిగోరి మండలంలోని రామగుండాలపల్లి గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారా యణరావు శంకుస్థాపన చేశారు. అనంతరం మాటా ్డుతూ ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో పారదర్శకత పాటిం చామన్నారు. అర్హులైన ఇళ్ళ స్థలం ఉన్న ప్రతి ఒక్కరికీ దీని ద్వారా లబ్ధి చేకూరుస్తున్నామని తెలిపారు. ఇళ్లు మంజూరైన వారు సకాలంలో నిర్మాణం పూర్తిచే యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ విజ్జన్‌రావు, కాంగ్రెస్ నాయకులు ఎడెల్లి మోహన్‌రెడ్డి, ఎడ్ల మల్లారెడ్డి, వీరబ్రహ్మం, రవికుమార్, మొట్టె కిరణ్, పాతుపల్లి సంతోష్, అమ్ముల రాజన్న, పున్నం రవి, పత్తి తిరుపతి, వావిలాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలి : డీఈవో



ఏఐ కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ములుగు డీఈవో పాణిని

ఏటూరునాగారం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) జి. పాణిని అన్నారు. మండ లంలోని రామన్నగూడెం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నూతన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన మండల విద్యా శాఖ అధికారి(ఎంఈవో) కొయ్యడ మల్లయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ఏఐ ల్యాబ్ మూడు నుంచి ఐదో తరగతి వరకు చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం ఎంఈవో మల్లయ్య మాట్లాడుతూ ఏఐ ల్యాబ్ ద్వారా విద్యార్థులకు నూతన విద్యా విధానాన్ని పరిచయం చేయొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ మాస్టర్ పి. నటరాజ్, రామన్నగూడెం జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మహేందర్

ములుగు కలెక్టరేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ అన్నారు. శనివారం ములుగులోని షెడ్యూల్డ్ కులాల బాలికల వసతిగృహం ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. 6నుంచి 14ఏళ్లలోపు పిల్లలకు విద్యను ప్రాథమిక హక్కు గా చేర్చిందని, అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం ఉచిత సీట్లను రిజర్వుడ్ చేయడం జరిగిందని అన్నారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా బాల్య వివాహ నిరోధక చట్టం, బాలకా ర్మికులు, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాచర్ల రాజ్‌కుమార్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఓదెమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడి పరామర్శ



మృతుడి కుటుంబాన్ని పరమర్శిస్తున్న లక్ష్మణ్‌బాబు

ఏటూరునాగారం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేం ద్రంలోని 2వ వార్డుకు చెందిన పెద్దబోయిన ముత్తయ్య అనారో గ్యంతో శనివారం మృతి చెందగా ఆయన మృతదేహాన్ని బీఆర్ఎస్‌జిల్లా అధ్యక్షుడు కాకు లమర్రి లక్ష్మీ నర్సింహరావు (లక్ష్మణ్‌బాబు) సందర్శించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రామాలయంలో లక్ష్మణ్‌బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా నాయకులు కాకులమర్రి ప్రదీప్ రావు, సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, తాడూరి రఘు, బాస పుల్లయ్య, భాస్కర్ బాబు, గండేపల్లి నర్సయ్య, రామాలయ ఆలయ కమిటీ చైర్మన్ ఆలువాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఇసుక క్వారీల ఎంపిక ఏకగ్రీవం

మంగపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లూరు ఇసుక క్వారీ ఎంపిక ఏకగ్రీవమైంది. శనివారం జరిగిన పెసా గ్రామసభలో ఈ మేరకు ఖరారైంది. ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు విజయలక్ష్మి, యాకన్న అధ్యక్షతన గ్రామ సభ జరగ్గా తహసీల్దార్ తోట రవీందర్, ఎంపీడీవో బి. భద్రు, పెసా జిల్లా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్, ఎమ్మారై శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పోరిక రూప్‌సింగ్, రాజేశ్ పాల్గొన్నారు. మల్లూరులో 2535 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 268 మంది గిరిజనులు ఉన్నారు. 130 మంది గిరిజనులు ఆమోదం తెలపగా శ్రీ సమ్మక్క- సారలమ్మ ట్రైబల్ ఇసుక మొరం సొసైటీకి క్వారీ ఖరారైంది. ఇదేవిధంగా చుంచుపల్లి పెసా గ్రామసభలో ఆదిలక్ష్మి చెంచులక్ష్మి ఇసుక క్వారీ మొరం గిరిజన సొసైటీ, రెండు సొసైటీలు ఉండగా 601 మంది గిరిజనులకు 203 మంది హాజరయ్యారు. మెజారిటీ సభ్యులు ఆమోదంతో ఇసుక క్వారీలను ఖరారు చేశారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి స్నేహారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చొక్కాల, వెంగళరావుపేట, సూరవీడు, నూగూరు గ్రామాల్లో వేర్వేరుగా వైద్యశిబిరాలు జరగగా ఆమె ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో వడదెబ్బ బారినపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. శిబిరాల్లో వైద్యాధికారులు ఆశిష్, వినయ్, డీపీఎంవో సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

రఘునాథపల్లి భూ సమస్యలను పరిష్కరించాలి : బిల్ట్ కార్మికులు

మంగపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : బిల్ట్ కార్మికుల కష్టాలతో కొనుగోలు చేసిన జనగాం జిల్లా రఘునాథపల్లిలోని 64 ఎకరాల భూమికి సంబంధించిన సమస్యను పరిష్కరించాలని కమలాపురం బిల్ట్ కార్మికులు డిమాండ్ చేశారు. కమలాపురంలో బిల్ట్ కార్మికులు గులగట్టు విజయరావు, కాట ఆనందరావు, బలిజ మొగిలి శనివారం విలేకరులతో మాట్లాడారు. బిల్ట్ కర్మాగారం నడుస్తున్న క్రమంలో కార్మికులుగా తాము కష్టపడి పనిచేసిన సమయంలో కోట్ల రూపాయల లాభాలు వచ్చాయన్నారు. ఈ క్రమంలో రఘునాథపల్లిలో సుమారు 64 ఎకరాల భూమిని అప్పటి బిల్ట్ యాజమాన్యం కొనుగోలు చేసిందన్నారు. ఆ విలువైన భూమిని కార్మికులకు తెలియకుండా పరిశ్రమ మూతపడిన అనంతరం కార్మిక జేఏసీ నాయకులతో కుమ్మక్కై యాజమాన్యం అమ్ముకుందని ఆరోపించారు. భూములను అమ్ముకొంటున్న సమయంలో కార్మికులకు రావాల్సిన పెండింగ్ వేతనాలు, గ్రాడ్యుటీ, పీఎఫ్‌లను ఇవ్వకుండా యాజమాన్యంతో కలిసి జేఏసీ నాయకులు మోసం చేశారని ఆరోపించారు. రఘునాథపల్లి 64 ఎకరాల భూమిని ఎందుకు విక్రయించారో.. దాన్నెవరో కొన్నారో కార్మికులకు బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మిక జేఏసీ నాయకులపై, బిల్ట్ డీజీఎం కేశవరెడ్డి, జేసీఎల్ సునీతపై కేసులు పెడతామని హెచ్చరించారు.

ఘనంగా తెలుగుదేశం ఆవిర్భావ దినోత్సవం

గోవిందరావుపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకుడు నర్రా శివాజీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర బీసీసెల్ కార్యనిర్వహణ కార్యదర్శి, మాజీ జడ్పీటీసీ సురవరపు వెంకట్రామయ్య, పార్టీ మండల అధ్యక్షుడు జంపాల సత్యం, నాయకులు దయానందం, కిషోర్, జోగా, దేవా, మల్లికార్జునరావు, నాసర్, నర్రా సత్యనారాయణ, పర్వతనేని పూర్ణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ఆవిర్భావ దినోత్సవం మండల కేంద్రంలో ఘనంగా జరిగింది. టీటీడీపీ జిల్లా అడ్‌హక్ కమిటీ సభ్యుడు కోడెల భద్రయ్య, దూడపాక సాంబయ్య, గుమ్మడి శంకర్‌రావు, సామల సాంబయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

● మంగపేట (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలోని రాజుపేట, చుంచుపల్లి, మంగపేట, కమలాపురం గ్రామాల్లో నిర్వహించారు. టీడీపీ వ్యవస్థాపక సభ్యుడు లెక్కల వేణుగోపాలనాయుడు, టీడీపీ మండల ఇన్‌చార్జి కొడవలి రఘు, సీనియర్ నాయకుడు కంచెర్ల రాంబాబు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

● వాజేడ (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి, టీడీపీ సీనియర్ నాయకుడు గుడివాడ సత్యనారాయణ పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దానిశెట్టి ఆంజనేయులు, ఎట్టి చందర్‌రావు, గుడివాడ గణేష్, తుమ్మ వెంకటేశ్వర్లు, సారిక లక్ష్మణ్, బట్టి నర్సయ్య, తుమ్మ సాయి, తదితరులు పాల్గొన్నారు.